సాక్షి
ఒడిశా
శనివారం । 13 । మే । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,15,690, బంగారం 1.1 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



సారూ.. మీ డబ్బులు అందాయా?

• ఏడీఎంను ప్రశ్నించిన డొంగిరియా మహిళ

-IIలో



విజేతలెవరో..!

• నేడే ఝుర్సుగుడ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు

-IIలో

న్యూస్‌రీల్

18న 'వందేభారత్' ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్రంలో వందేభారత్ సమీ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఈనెల 18నుంచి అందుబాటులోకి రానున్నాయి. గతంలో ఈనెల 15న రైలు ప్రారంభించనున్నట్లు ప్రకటించిన రైల్వేశాఖ.. కార్యక్రమాన్ని వాయిదా వేసింది. తాజా సమాచారం మేరకు ఈనెల 18న పూరీ రైల్వేస్టేషన్ నుంచి వందే భారత్ రైలు ప్రారంభించనున్నారు. పూరీ–హౌరా మధ్య ఈ సేవలు లభ్యమవుతాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైలును అందుబాటులోకి తీసుకువస్తారు. కేంద్ర రైల్వేమంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రత్యక్షంగా హాజరుకానున్నారు. ఏప్రిల్ 28న హౌరా–పూరీ మధ్య వందేభారత్ రైలు ట్రయల్ రన్ నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ ఆరోగ్య సేవలు అందించండి



మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిధా

బరంపురం: గంజాం జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన ప్రతి ఒక్కరికీ ఉత్తమ సేవలు అందించాలని కలెక్టర్ దివ్యజ్యోతి పరిధా ఆదేశించారు. జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆరోగ్యశాఖ సమీక్షలో ఆయన మాట్లాడారు. గంజాం జిల్లాలోని బరంపురం నగరంతో పాటు ప్రతి బ్లాక్‌లో ఉన్న ఆరోగ్య కేంద్రాల్లో బాధితులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్య పోస్టులు త్వరలో భర్తీ చేసేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి సదానంద మిశ్రా, ఏసీడీఎం జగదీశ్వర్ పట్నాయక్, డీపీఎం శ్యామ్ సుందర్ త్రిపాఠి, డీఎంఆర్‌హెచ్ ఆశిష్‌కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

తులసిపహడ్‌లో ఇంటెలిజెన్స్ డైరెక్టర్ పర్యటన



అధికారులకు స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితిలో పోలీస్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సంజీవ్‌పండా, ఆపరేషన్స్ ఏడీజీ అమితాబ్ ఠాకూర్ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా తులసిపహడ్‌లో నూతనం ఏర్పాటు చేసిన బీఎస్‌ఎఫ్ శిబిరాన్ని సందర్శించి, అక్కడి జవాన్లతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన తులసిపహడ్‌లో మావోయిస్టుల ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దళాల ఆగడాలు నిర్మూలించేందుకు ఏ విధమైన చర్యలు చేపట్టాలో చర్చించారు. అనంతరం స్థానిక గిరిజనులతో మమేకమయ్యారు. ఏమైనా సమస్యలు ఉంటే సిబ్బందికి తెలియజేయాలని, తగిన సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. అలాగే మహిళలకు చీరలు, నిత్యావసర సరుకులు, చిన్నారులకు నోట్ పుస్తకాలు, వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పర్యటనలో కొరాపుట్ డీఐజీ రాజేష్ పండిత్, మల్కన్‌గిరి ఎస్పీ నితీష్ వాధ్వనీ తదితరులు పాల్గొన్నారు.

బురద పోలమ్మ ఉత్సవాలకు శ్రీకారం



ముహూర్తపు రాటకు పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

రాయగడ: ఈనెల 29నుంచి జరగనున్న రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు పట్టణంలనోని మెయిన్ రోడ్డు ప్రాంతంలో ముహూర్తపు రాట పూజలు శుక్రవారం చేపట్టారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బార్జి జగన్‌మోహన్ నాయుడు, సాధారణ కార్యదర్శి ఎద్దు శ్రీహరి, కోశాధికారి బొత్స శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. గ్రామదేవత ఆలయ ప్రధాన పూజారి బలముండ అమ్మవారికి ఆహ్వాన పూజలు జరిపారు. దీంతో ఉత్సవాలకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లుగా కమిటీ ప్రకటించింది. 9రోజుల జరగనున్న ఈ ఉత్సవాలు జూన్ 7తో ముగుస్తాయి. పూజల్లో ముంజేటి గంగాధర్, కింతలి కరుణాశంకర్, సీర రమణ, కింతలి శ్రీనివాస్, రిక్కా హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చందనోత్సవం

• అలార్‌నాథ్ ఆలయంలో ఘనంగా భంవురి జాతర
• సర్వాంగ చందనసేవ నిర్వహించిన సింగారీ వర్గం సేవకులు
• స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీమందిరం నుంచి ఆజ్ఞామాలల ఆగమనం



పూజలు చేస్తున్న శ్రీమందిరం సీఈఓ రంజన్ కుమార్ దాస్



చందనం తయారీలో విమానబొడు సేవకులు

భువనేశ్వర్: పూరీ జిల్లా బ్రహ్మగిరిలో కొలువుదీరిన అలార్‌నాథ్ స్వామివారి భంవురి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొనసాగుతున్న చందన జాతర ముగింపు భంవురి జాతరగా పేర్కొంటారు. ఈ సందర్భంగా స్వామివారికి సర్వాంగ చందనసేవ జరిపారు. అక్షయ తృతీయ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం.. శుక్రవారంతో పూర్తయ్యింది. ఇందులో భాంగా తెల్లవారుజాము 4 గంటలకు దేవస్థానం తలుపులు తెరిచారు. మంగళ హారతి, దంతధావనం, అలంకరణ, తులసిసేవ తదితర సేవలు ముగించారు. అనంతరం సర్వాంగ చందనసేవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చందన్ ఘోర సేవకులు 10 కిలోల గంధాన్ని సిద్ధం చేశారు. 10కిలోల చందనం చెక్కలు, కర్పూరం, కేశర్, జాజికాయ ఇతరేతర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో చందనాన్ని తయారు చేశారు. ఇందులో 16మంది విమాన బొడు వర్గం కార్మికులు పాలుపంచుకున్నారు. వల్లభ ధూప సేవ అనంతరం సింగారీ వర్గం సేవకులు స్వామివారికి సర్వాంగ చందనసేవ నిర్వహించారు. చందన అలంకరణలో స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు. సుశోభిత పల్లకీలో సాయంత్రం అలార్‌నాథుని ఉత్సవమూర్తులు మదన్ మోహన్, లక్ష్మీ సరస్వతి, రామకృష్ణల ప్రతిమలను ఊరేగింపుగా పుష్కరిణికి తరలించి భంవురి జాతర నిర్వహించారు.

ఇరుసుకు రథచక్రాల అమరిక

శ్రీ జగన్నాథుడు కొలువుదీరిన పూరీ శ్రీక్షేత్రంలో భంవురి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీమందిరంలో మూల విరాట్‌ల ఆజ్ఞామాలలు రథాల తయారీ ప్రాంగణానికి చేరాయి. ఇరుసుకు చక్రాలు అమర్చే సందర్భంగా భంవురి యాత్ర జరుగుతుంది. రథం ఇరుసుకు చక్రాల అమరికకు స్వామి ఆజ్ఞకు ప్రతీకగా ఆజ్ఞామాలలు తరలి రావడం ఆనవాయితీ. ఒక్కో రథానికి ఒక్కో మాల ఆయా మూలవిరాట్‌ల నుంచి చేరుతుంది. ప్రాతఃకాల ధూపదీపాల అనంతరం ఉత్సవం ప్రారంభమైంది. 3 రథాల ఇరుసుకు చక్రాలు అమర్చారు. లాంఛనంగా ఒక్కో రథానికి 2 చొప్పున 6 చక్రాలు 3 ఇరుసులకు అనుసంధానించారు. తొలుత బలభద్రుడి తాళధ్వజం, తదుపరి జగన్నాథుని నందిఘోష్ రథం, చివరగా సుభద్రా దేవి దర్పదళన రథం ఇరుసుకు చక్రాలు అమర్చారు. శ్రీమందిరం చీఫ్ అడ్మినిస్ట్రేటర్ రంజన్‌కుమార్ దాస్ సమక్షంలో భంవురి మహోత్సవం ముగించారు.



ఇరుసుకు చక్రాలు అనుసంధానపరుస్తున్న భొయి సేవకులు



పవిత్ర జలంతో ఇరుసు శుద్ధి పూజాదికాలు



దర్శనమిస్తున్న అలార్‌నాథ్ స్వామి



భక్తుల తాకిడితో కిటకిటలాడుతున్న అలార్‌నాథ్ దేవస్థానం

కొలువుదీరిన లారీ యజమానుల సంఘం

• అధ్యక్షుడిగా కొండబాబు ప్రమాణ స్వీకారం



అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కొండబాబు, కార్యవర్గ సభ్యులు

రాయగడ: స్థానిక పట్టణానికి చెందిన లారీ యజమానుల సంఘం నూతన కార్యవర్గం శుక్రవారం కొలువుదీరింది. సభ్యులుగా ఎన్నికైన వారంతా సంఘం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో బాధ్యతలు స్వీకరించారు. సంఘం అధ్యక్షుడిగా బీజేడీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు సభ్యుల మధ్య ప్రమాణ స్వీకారం చేశారు. లారీ యజమానుల సంఘానికి 4దశాబ్దాల తరువాత ఎన్నికలు జరగడంతో పాటు కార్యవర్గ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ సంఘంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించేందకు తనవంతు కృషి చేస్తానని ప్రకటించారు. ఇంతవరకు సొంత స్థలంలో కార్యాలయం లేదని, ఏర్పాటుకు అంతా సహకారం అందించాలని కోరారు.

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు



పర్యవేక్షిస్తున్న ఈఓ సిద్ధార్థ పట్నాయక్, పోలీసులు



క్రిస్టియన్‌పేటలో యంత్రాల సాయంతో తొలగిస్తున్న ఆక్రమణలు

జయపురం: వర్షాల సీజన్ ప్రారంభానికి ముందే పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. జయపురం మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణలో ప్రధాన మార్గంలోని ఆక్రమణల తొలిగింపు ముమ్మరంగా కొనసాగించారు. ఈఓ సిద్ధార్థ పట్నాయక్ ఆదేశాల మేరకు 26వ నంబర్ జాతీయ రహదారి లక్ష్మీపండా కూడలి నుంచి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను యంత్రాల సాయంతో కూల్చివేశారు. ఆక్రమణదారులకు గతంలో నోటీసులు జారీ చేసిన మున్సిపల్ అధికారులు.. కట్టడాలను తొలగించాలని కోరారు. అయితే వారి నుంచి స్పందన లేకపోవడంతో తొలగింపులు ప్రారంభించామని అధికారులు శుక్రవారం తెలిపారు. ఆక్రమణల కారణంగా పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయని, దీనిని నివారించేందుకు ఈ చర్యలు చేపట్టామని ఈఓ వివరించారు. తొలగింపు సమయంలో శాంతి భద్రతలకు ఎటువంటి అంతరాయం లేకుండా 2ప్లాటూన్ల పోలీసు బలగాలను మొహరించారు.

కొరియా అభివృద్ధికి చర్యలు



కొఠియాపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ అక్తర్

కొరాపుట్: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద ప్రాంతం కొఠియా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ మహ్మద్ అక్తార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రం లోని సద్భావనా స్వగృహంలో కొఠియాపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పొట్టంగి సమితి కొఠియాలో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది డిసెంబర్ 20 లోగా కొఠియా పంచాయతీలోని ప్రతి గ్రామానికి విద్యుత్, తాగునీరు అందించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే నిర్మాణాల వేగవంతం చేయాలని తెలిపారు. ఒడిశా జీవనోపాధి పథకం కింద ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. తరచూ జిల్లా స్థాయి ఉన్నతాధికారులు కొఠియాను సందర్శించాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రతి పథకం ఇక్కడి ప్రజలకు అందించాలని స్పష్టంచేశారు. సమీక్షలో జిల్లా ఎస్పీ అనుభవ్ శంకర్, విద్యుత్, వాటర్‌షెడ్, ఎత్తిపోతల, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

నడి రోడ్డుపై యువకుడి హత్య

బరంపురం: నగర శివారు లాటి–సుకుండా రహదారిలో పాతకక్షల కేంద్రంగా ప్రత్యర్థి వర్గం దుండగులు బౌరిబొంద గ్రామానికి చెందిన గౌరంగా దాస్‌ను హత్య చేసి, పరారయ్యారు. సమాచారం అందుకున్న సదర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం బరంపురం ఎంకేసీజీ మెడికల్ కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దుండగుల కోసం గాలిస్తున్నామని ఐఐసీ మహేంద్రకుమార్ బెహరా తెలిపారు.

ఆదర్శ నగరంగా బరంపురం



మాట్లాడుతున్న మేయర్ సంఘమిత్ర దొళాయి, పక్కన ఎంపీ చంద్రశేఖర్ సాహు



బీఎంసీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు

• కౌన్సిల్ సమావేశంలో బీఎంసీ మేయర్ సంఘమిత్ర

బరంపురం: రాష్ట్రంలో అతి పురాతనమైన బరంపురం నగరం.. ఇకపై గోల్డెన్ సిటీగా అభివృద్ధి చేయనున్నట్లు బరంపురం మున్సిపాలిటీ కార్పొరేషన్(బీఎంసీ) మేయర్ సంఘమిత్ర దొళాయి ప్రకటించారు. బీఎంసీ కమిషనర్ సోనాలి జెనా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఇందులో బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు, ఎమ్మెల్యే విక్రమ్ పండా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో రూ.825 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కౌన్సిల్ తీర్మానించిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని చర్యలు చేపట్టి, ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో నగర కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

స్నేహితులే నిందితులు

• యువకుడి అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు



బనకుమార్ పొరజ దాము గదబ

జయపురం: స్థానిక సమితిలోని టంకుగుడ గ్రామంలో అనుమానాస్పదంగా మృతిచెందిన ధనపతి హరిజన్ కుమారుడు లల్లూ హరిజన్(21)ది హత్యగా పోలీసులు గుర్తించారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా, వాస్తవాలు వెలుగు చూశారు. దీనిపై జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టంకుగుడ గ్రామానికి చెందిన ధనపతి పొరజ కుమారుడు బనకుమార్ పొరజ, కృష్ణ గదబ కుమారుడు దాము గదబ, లల్లూ హరిజన్ స్నేహితులు. ముగ్గురూ కలిసి ఈనెల 6న గ్రామానికి సమీపంలోని కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లారు. అక్కడ ముగ్గురి మధ్య వివాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జరిగిన కొట్లాటతో బనకుమార్, దాము.. లల్లూను చితకబాదారు. బండరాయితో తలపై దాడి చేయగా, లల్లూ అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని కాలువలోకి విసిరేశారు. కుమారుడు కనిపించక పోవడంతో ధనపతి హరిజన, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఈనెల 8న రొండాపల్లి సమీపంలోని కాలువలో లల్లూ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. వెంటనే జయపురం సదర్ పోలీసులకు సమాచారం అందించగా, సిబ్బంది అక్కడికి చేరుకొని, మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జయపురం ఆస్పత్రికి తరలించి, రిపోర్టు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. టంకుగుడ గ్రామంలోని కాలువ వద్ద యువకుడిని హతమార్చేందుకు వినియోగించిన బండరాయిని గుర్తించారు. లల్లూతో కలిసి బయటకు వెళ్లినట్లు గ్రామస్తులు తెలియజేయడంతో బనకుమార్, దాము లను అదుపులోకి తీసుకొని, విచారించారు. నిందితులు నేరాన్ని అంగీకరించడంతో అరెస్ట్ చేశామని పోలీసులు వివరించారు.

12కిలోల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి బలిమెల పోలీసు స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు గంజాయి పాటు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. బలిమెల ఐఐసీ జాన్‌ఖుజుర్ ఆధ్వర్యంలో సిబ్బంది టోనాల్ క్యాంప్–ఖడికజోడి గ్రామాల మధ్య శుక్రవారం వేకువజామున అతివేగంగా వెళ్తున్న బైక్‌ను గమనించారు. అనుమానంతో వాహనాన్ని తనిఖీ చేయగా.. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లో 12కిలోల గంజాయిని గుర్తించారు. ఈ నేపథ్యంలో బైక్‌పై ఉన్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. సరుకును స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేశారు. గంజాయిని ఢిల్లీకి చెందిన యువతి సాబ.. చిత్రకొండలో దీనిని కొనుగోలు చేసి, కుమార్‌గుడకు చెందిన యువకుడు సనియా ముదిలికి అప్పగించినట్లు నిందితులు అంగీకరించారు. అక్కడి నుంచి మల్కన్‌గిరి, రాయిపూర్ మీదుగా ఢిల్లీకి తరలించేందుకు రవాణా చేస్తున్నామని తెలిపారు. పట్టుబడిన సరుకు విలువ రూ.60 వేలు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అరెస్ట్..

పర్లాకిమిడి: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఎక్సైజ్‌శాఖ అధికారులు జరిపిన దాడుల్లో 23కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ప్రభాత్‌కుమార్ శెఠి ఆదేశాల మేరకు ఎస్ఐ లింగరాజ్ దామిన్ పర్లాకిమిడి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని తనిఖీ చేశారు. మోహానా సమితి పట్టిగజపతి గ్రామానికి చెందిన నిందితుడు అజయ్ నాయక్ వద్ద నుంచి 15.2 కిలోల గంజాయి పట్టుబడింది. అలాగే రాయఘడ బ్లాక్ లంజిపదర్ జంక్షన్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ మంగళ త్రిపాఠి బైక్‌పై రవాణా చేస్తున్న వ్యక్తి నుంచి 8కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అడవ పోలీసు పరిధి కేసరిగుడ గ్రామానికి చెందిన జైన్ రైకాగా గుర్తించారు. దాడుల్లో దీపక్ మహాపాత్రో, ఏఎస్ఐ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. నిందితులను పర్లాకిమిడి కోర్టుకు తరలించారు.

చిన్నారులను కలిసిన కలెక్టర్లు



బర్షా పరజతో మాట్లాడుతున్న కొరాపుట్ కలెక్టర్ అక్తర్



అర్పితా దాస్, తపస్వని జానీతో నవరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్ మిశ్రా

కొరాపుట్: కరోనా మహమ్మారి ప్రభావంతో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను ఇరు జిల్లాల కలెక్టర్లు శుక్రవారం కలుసుకున్నారు. కొరాపుట్‌లో కలెక్టర్ అబ్దుల్ మమ్మద్ అక్తార్ జయపురం సమితి బంకబిజ గ్రామానికి చెందిన బర్షా పరజను తన ఛాంబర్‌లో కలిసి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే నవరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా డాబుగాంకు చెందిన అర్పితా దాస్, ఉమ్మర్‌కోట్‌కు చెందిన తపస్వనీ జానీ లను పరామర్శించారు. కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో బాధిత చిన్నారుల అకౌంట్‌లో పీఎం కేర్ నిధి నుంచి రూ.10 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. దీని నుంచి వచ్చిన వడ్డీని ప్రతి నెలా తీసుకునే విధంగా సౌలభ్యం కల్పించారు. దీనితో పాటు కేంద్రం ప్రవేశ పెట్టిన ఆశీర్వాద్ పథకం ద్వారా చిన్నారులకు 18ఏళ్లు వచ్చేవరకు ప్రతి నెలా రూ.2,500లు పింఛన్ పొందవచ్చు. రాష్ట్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ వాత్సల్య పథకం కింద నెలవారీ రూ.4వేలు ఉపకార వేతనం అందిస్తారు. ఈ పథకాల ద్వారా సహాయం పొందుతున్న బాలల క్షేమ సమాచారం తెలుసుకున్నట్లు కలెక్టర్లు ప్రకటించారు.

క్లుప్తంగా

విజేతలెవరో..!

- నేడే ఝార్సుగుడ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు



భువనేశ్వర్: ఝార్సుగుడ ఉప ఎన్నిక పురస్కరించుకొని ఓట్ల లెక్కింపు స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం చేపట్టనున్నారు. ఉదయం 8గంటల నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించనున్నారు. సాయంత్రం 4–6 గంటల మధ్య కౌంటింగ్ పూర్తి కానున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) నికుంజొ బిహారి ధొలొ తెలిపారు. రౌండ్ వారీగా లెక్కింపు వివరాలు కలెక్టర్ ప్రకటిస్తారు. ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ results. eci. gov. inలో లెక్కింపు ఫలితాలు ప్రసారమవుతాయి. మరోవైపు విజేతలపై జోరుగా ప్రచారాలు సాగుతున్నాయి. బీజేడీ అభ్యర్థిగా దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె దీపాలి దాస్, బీజేపీ నుంచి టొంకొధొర త్రిపాఠి, కాంగ్రెస్ నుంచి తురుణ్ పాండే మధ్య పోటీ కొనసాగనుంది. వీరిలోనుంచే విజేతలు తేలనున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఆదర్శపాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: ఆదర్శ పాఠశాలల్లో 2023 విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. భామిని, కురుపాం, మునక్కాయవలస, పురోహితునివలసలలో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో చేరేందుకు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల చేసుకోవాలన్నారు. ఆదర్శ పాఠశాలల్లో ఆంగ్లంలో బోధన ఉంటుందని, ఉచిత విద్య అందుతుందన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ సీఎస్‌సీ.ఏపీ.జీఓవీ. ఇన్ వెబ్‌సైట్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్. ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెంప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగస్టు 31 మధ్య జన్మించిన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో నిరవధికంగా 2021–22, 2022–23 విద్యాసంవత్సరాల్లో చదివి ఉండాలని, 2022–23 విద్యాసంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్‌కు అర్హత కలిగి ఉండాలన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం లీగల్: విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ బి. కళ్యాణచక్రవర్తి తెలిపారు. సివిల్, రాజీకి అర్హత గల క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల చట్టానికి సంబంధించిన కేసులతో పాటు ఇతర కేసులు పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఇరువర్గాల వారి ఆమోదం మేరకే కేసులు రాజీ చేస్తామని చెప్పారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పురుగుమందు తాగి యువకుడి ఆత్మహత్య

బాడంగి: తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్సై డి.కొండలరావు తెలిపిన వివరాలిలాఉన్నాయి. బాడంగి మండలంలోని బొత్సవానివలస గ్రామానికి చెందిన అలజంగి నిర్మల, సుధల మొదటిసంతానం గణేష్(24) పాలిటెక్నిక్ చదువుకుని ఖాళీగా ఉంటూ అల్లరిచిల్లరగా తిరుగుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన గణేష్ గురువారం రాత్రి పురుగు మందు తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు బాడంగి సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

పెణసాంలో యువకుడు..

గంట్యాడ: మండలంలోని పెణసాం గ్రామానికి చెందిన పురోహితుడు శ్రీనివాస రామశాస్త్రి (28) శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు వృద్ధులు. ఏ కారణం చేత ఆత్మహత్య చేసుకున్నాడో తెలియరాలేదు. ఇదేవిషయాన్ని ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు వద్ద ప్రస్తావించగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న మాట వాస్తవమేనని, కుటుంబసభ్యులు ఇంకా ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పార్వతీపురం: ఒడిశా రాష్ట్రంలోని అలమండకు బొలెరో వాహనంలో అక్రమంగా రవాణాచేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పార్వతీపురం మండలం జోకిశీల గ్రామంనుంచి అలమండ గ్రామానికి 54 బస్తాలు (50 కిలోలు) బియ్యం తరలిస్తుండగా మండలంలోని రావికోన బట్టివలస గ్రామ సమీపంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మాటువేసి పట్టుకున్నారు. పట్టుబడిన బియ్యంతో పాటు బొలెరో వాహనాన్ని రూరల్ పోలీసులకు అప్పగించారు.

సారూ.. మీ డబ్బులు అందాయా?



ఏడీఎం బెహరాతో మాట్లాడుతున్న టిమి పుషిక

- ఏడీఎంను ప్రశ్నించిన డొంగిరియా మహిళ
- ఖంగుతున్న ఉన్నతాధికారి.. విచారణకు ఆదేశం

రాయగడ:

జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరా వద్దకు అమాయకురాలైన డొంగిరియా తెగకు చెందిన మహిళ సరాసరి వెళ్లి, ప్రశ్నించిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 'సారూ.. మీపేరు చెప్పి నా నుంచి డబ్బులు వసూలు చేశారు. ఆ డబ్బులు మీకు అందాయా?' అని ప్రశించడంతో ఏడీఎం బెహరా ఖంగుతిన్నారు. 'నేను డబ్బులు తీసుకోవడం ఏంటి.. అసలు ఏం చెప్పాలనుకుంటున్నావు, సూటిగా చెప్పమ'ని అధికారి నిలదీశారు. దీనికి మరోసారి సమాధానమిచ్చిన ఆమె.. 'అవును సారూ.. మీ పేరు చెబితేగా నేను డబ్బులు ఇచ్చేది. అవి మీకు అందాయా?' అని మళ్లీ అడిగింది. దీంతో ఏడీఎం ఆశ్చర్యానికి గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని బిసంకటక్ సమితి చంచాగుడ పంచాయతీ పరిధిలోని నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న బలపాయి గ్రామానికి చెందిన మహిళ టిమి పుషిక(38) జిల్లా అదనపు మేజిస్ట్రేట్ ధర్మానంద బెహరాను కలిసింది. అధికారి గదిలోకి వెళ్లిన ఆమెను చూసిన అధికారి.. ఏం సమస్యో చెప్పమ్మా.. అని ప్రశ్నించగానే, ఆ మహిళ తడబాటు లేకుండా సారూ మీకు డబ్బులు అందాయా అని అడిగింది. రెండోసారి కూడా అదే ప్రశ్న ఎదురు కావడంతో ఖంగుతిన్న అధికారి.. అసలు ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం చేశారు.

జరిగింది ఇదీ..

వ్యాపారం చేసుకుని జీవించేందుకు డీకేడీఏ(డొంగిరియా కొండొ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) సంస్థ టిమి పుషికి దరఖాస్తు చేయగా, రూ.27 వేలు మంజూరయ్యాయి. ఈ మొత్తం ఆమె ఖాతాలోజమయ్యాయి. ఇందులో రూ.7,900లతో ఎలక్ట్రికల్ వెయిట్ మెషీన్, రూ.5,500తో సైకిల్, రూ.900తో 2 కుర్చీలు కొనుగోలు చేసింది. మిగతా సొమ్ముతో ఏదో చిన్న వ్యాపారం చేసుకుందామని అనుకునే లోగానే ఖాతా నుంచి రూ.7,500ల నగదు ఖాతా నుంచి ఇవ్వాలని అదే శాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది ఆమెను డిమాండ్ చేశారు. ఎందుకని ప్రశ్నించగా, వ్యాపారం కోసం నిధులు మంజూరు చేసిన అధికారులకు ఆ డబ్బులు ఇవ్వాలని తెలిపారు. దీంతో రమేష్ నల్ల, సహదేవ్ అడిగిన మొత్తాన్ని మహిళ అందజేసింది. ఆ డబ్బులు అధికారికి అందాయా? లేదా! అని తెలుసుకుందామని నేరుగా ఏడీఎం వద్దకు వచ్చినట్లు ఆమె అమయాకంగా బదులిచ్చింది. విషయం తెలుసుకున్న ధర్మానంద బెహరా.. ఘటనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అమాయక మహిళ నుంచి డబ్బులు వసూలు చేసిన సిబ్బందిపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. దీనిపై విచారం వ్యక్తం చేసిన ఆయన.. పూర్తి న్యాయం చేస్తానని మహిళకు హామీ ఇచ్చారు.

రూ.124 కోట్ల విలువైన పనులకు అవకాశం

- కలెక్టర్ నిషాంత్ కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో రూ.124 కోట్ల విలువైన పనులకు చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనుల ప్రతిపాదనలు తక్షణమే సమర్పించాలన్నారు. జిల్లా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని.. ఈ నేపథ్యంలో పనులను సక్రమంగా చేపట్టాలన్నారు. సచివాలయం పరిధిలో రూ.40 లక్షల విలువ వరకు పనులు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులకు బిల్లులు వెంటనే మంజూరవుతాయన్నారు. ప్రజాప్రతినిధులతో సంప్రదించి 83 సచివాలయాల పరిధిలో పనులు పక్కాగా చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మంజూరైన 72 గంటల్లో పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనులకు సంబంధించిన అగ్రిమెంట్, నామినేషన్, తదితర అంశాలు ఐదు రోజుల్లో మండలస్థాయి బృందం పూర్తి చేయాలన్నారు. మంజూరు చేసిన పనులు పూర్తయిన వెంటనే కొత్త పనులు ప్రతిపాదించాలని సూచించారు. బిల్లులు అప్‌లోడ్ చేయడానికి 24/7 వ్యవస్థ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం పనులకు పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి.. పాలకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పనులకు సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని పర్యవేక్షణ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి. విష్ణుచరణ్, సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్లు జె. రామఅప్పలనాయుడు, హెచ్.శంకరరావు, ఎస్. సర్వేశ్వరరావు, జిల్లా ప్రజారోగ్య శాఖాధికారి కేజీఎన్. నరసింగరావు, డీఈలు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం



చికిత్సపొందుతున్న అప్పారావు, సాయి

పార్వతీపురం: మద్యం విషయంలో జరిగిన గొడవతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం చినగోడిజ గ్రామానికి చెందిన కొండగొర్రి అప్పారావును మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగవద్దని భార్య మందలించినందుకుగాను, ఆమె గాజులు పగులగొట్టి మందులో కలిపి తాగేశాడు. అదే సమయంలో భార్య సాయి కూడా తన గాజులు చితక్కొట్టి నీటిలో కలిపి తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దంపతుల గొడవను గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పెళ్లి భోజనం కలుషితం

- కొవ్వాడ అగ్రహారం వివాహ విందులో ఫుడ్‌పాయిజన్
- సుమారు 400 మందికి అస్వస్థత
- అంబులెన్సుల్లో ఆస్పత్రులకు తరలింపు
- బాధితులను పరామర్శించిన ఎమ్మెల్సీ, ఆర్డీఓ, డీఎస్పీ
- ఆహారం కలుషితం కావడంపై ఆరా
- ప్రాణహాని లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు



పూసపాటిరేగ పీహెచ్‌సీలో బాధితులను పరామర్శిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

పూసపాటిరేగ: మండలంలోని కొవ్వాడ అగ్రహారం గ్రామంలో కోట్ల గురునాయుడు మనవడు వివాహ విందుకు అందరూ సందడిగా వెళ్లారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం చేశారు. కాసేపటికి కొందరు వాంతులు, విరేచనాలు, తలతిప్పడం వంటి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. అంతే... విందుకు హాజరైనవారందరిలోనూ అలజడిరేగింది. అస్వస్థతకు గురైన సుమారు వంద మందిని అంబులెన్సుల్లో పూసపాటిరేగ, సుందరపేట పీహెచ్‌సీలకు తరలించి వైద్యసేవలు అందించారు. సాధారణ స్థితిలో ఉన్న మరో 300 మందికి గ్రామంలోనే వైద్యశిబిరం నిర్వహించి వైద్యాధికారి రాజేష్‌వర్మ పర్యవేక్షణలో వైద్యబృందాలు వైద్య పరీక్షలు చేశాయి. ఎవరికీ ప్రాణహాని లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. పిన్నింటి గోవిందరావు, కోట్ల లక్ష్మణరావు, కోట్ల పవన్, మిరప ఆదిలక్ష్మి, మిరప రోషన్‌కుమార్, కోట్ల సత్యం, జమ్ము సత్యనారాయణ, అల్లాడ శ్యాం, వాళ్లె భరత్‌రాజు, వాళ్లె మోక్షిత్, సిమ్మల అప్పయ్యమ్మ, దేబార్కి గౌరి, దేబార్కి బార్గవి, సిమ్మల పైడమ్మ, సిమ్మల పవిత్ర, రవనమ్మ, సుంకర లక్ష్మణరావు, గంగ్రేటి ఈశ్వరరావు, దేబార్కి తిరుమల ప్రసాదరావు తదితరులు ఆస్పత్రిలో వైద్యసేవలు పొందారు. ప్రస్తుతం వారంతా కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు.

ఆహారం కలుషితం కావడంపై ఆరా

కొవ్వాడ అగ్రహారంలో వివాహ విందును ఆరగించి అస్వస్థతకు గురైన బాధితులను ఎమ్మెల్సీ సురేష్ బాబు, ఆర్డీఓ సూర్యకళ, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు పరామర్శించారు. విందులో బిర్యాని, ఆహార పదార్థాలు ఎవరు తయారు చేశారు.. ఆహార సరుకులు ఎక్కడ నుంచి తెచ్చారు వంటి అంశాలపై ఆరా తీశారు. సమగ్ర నివేదిక అందజేయాలని తహసీల్దార్ ఇ.భాస్కరావును ఆర్డీఓ సూర్యకళ ఆదేశించారు. ఆహార విభాగం అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. బిర్యాని అరగకపోవడం వల్లే అస్వస్థతకు గురైనట్టు వైద్యులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఎంపీడీఓ రామారావు, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎస్. సత్యానారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, మహంతి లక్ష్మణరావు సహాయక చర్యలు చేపట్టారు.



పూసపాటిరేగ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫుడ్‌పాయిజన్ బాధితులు



కొవ్వాడ అగ్రహారంలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

భయంకరి విషాదం



అర్ధరాత్రి వేళ... తాగునీటికోసం వచ్చిన ఆరు ఏనుగుల గుంపులో నాలుగు ఏనుగులు విద్యుదాఘాతంతో చలనం లేకుండా పడిపోయాయి. ప్రమాదం నుంచి తప్పించుకున్న రెండు ఏనుగులు ఒక్క దాటున పరుగు తీశాయి. కాస్త దూరం వెళ్లాక తమ మిత్రబృందం వెంటరాకపోవడాన్ని చూసి ఘీంకరించాయి. వేకువజామున ఏనుగుల ఘీంకరింపును గమనించిన స్థానికులు ఏదో హానికలిగిందని భావించారు. పంట పొలాల్లోకి పరుగుతీశారు. ఘటనా స్థలంలో నాలుగు ఏనుగుల కళేబరాలను చూసి కన్నీరుకార్చారు. ఓ వైపు ఏనుగులు.. మరోవైపు స్థానికుల రోదనలతో ఆ ప్రాంతమంతా కన్నీటిసంద్రమైంది.



ప్రమాద స్థలంలో ఏనుగుల కళేబరాలు

- మూడునెలల కింద ఒడిశా లఖేరీ అడువుల నుంచి ఆంధ్రాలోకి వచ్చిన ఆరు ఏనుగులు
- భామిని మండలం కాట్రగట-బి వద్ద పంట పొలాల్లో తిష్ట
- గురువారం అర్ధరాత్రి దాటాక అక్కడి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకిన ఏనుగుల గుంపు
- మృత్యువాత పడిన నాలుగు ఏనుగులు
- తృటిలో తప్పకున్న మరో రెండు
- సహచర ఏనుగుల మృతితో సమీప కొండపైకి చేరి ఘీంకారం
- ఘటనా స్థలాన్ని మూడు జిల్లాల డీఎఫ్‌ఓల పరిశీలన
- ప్రమాద స్థలంలోనే ఖననం

భామిని:

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడ-బి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో సంచరించే ఆరు ఏనుగుల గుంపులో నాలుగు ఏనుగులు గురువారం అర్ధరాత్రి దాటాక విద్యుదాఘాతానికి గురయ్యాయి. అక్కడికక్కడే మృతిచెందాయి. పొలంగట్టు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ఒక వైపు మూడు ఏనుగులు, మరో వైపు ఒక ఏనుగు కళేబరం పడి ఉండడాన్ని చూసిన స్థానికులు చలించిపోయారు. నీటి కోసం వచ్చి ప్రమాదానికి గురైన తీరును చూసి కన్నీరు కార్చారు. పంట పొలాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా ఆరాధించబడే ఏనుగులు విగత జీవులుగా మారడంతో కన్నీటి పర్యంతమయ్యారు. తమ భాగ్యలక్ష్మిలు దూరమయ్యాయంటూ రోదించారు. ఏనుగుల కళేబరాలకు భక్తిపూర్వకంగా పసుపుకుంకుమలతో పూజలు చేసి అంతిమ వీడ్కోలు పలికారు. మూడు నెలలుగా కాట్రగడ-బి, పక్కుడుబద్ర గ్రామాల సమీపంలోని పొలాల్లో సంచరిస్తూ... నిత్యం తారసపడే ఏనుగులు కనుమరుగు కావడాన్ని తట్టుకోలేకపోతున్నారు.



ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్‌పై మట్టి నమూనాలు పరిశీలిస్తున్న కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి, డీఎఫ్‌ఓలు

లఖేరి అడవుల నుంచి వచ్చి.. విగతజీవులుగా మారి..

ఒడిశాలోని లఖేరీ అడువుల నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన కొత్తూరు-బత్తిలి రిజర్వుఫారెస్టులోకి ఆరు ఏనుగుల గుంపు ప్రవేశించింది. ఈ విషయం మరుసటి రోజున అటవీశాఖ ట్రాకర్స్ గుర్తించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. భామిని మండలం పరిధిలోని కాట్రడగ-బి పరిసరాల్లో స్వేచ్ఛగా సంచరించడం ప్రారంభించాయి. ఆహారం, నీటి అవసరాల కోసం పక్కుడుభద్ర తోటల నుంచి కాట్రడగ-బి వద్దకు చేరుకున్నాయి. అక్కడి పంట పొలాల నుంచి తిరిగి వెళ్లే క్రమంలో ఏనుగుల గుంపులోని గున్న ఏనుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తన తొండంతో తాకింది. ఒక్కసారిగా 6.3 కేవీ విద్యుత్ ప్రసరించడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ఈ క్రమంలో పిల్ల ఏనుగును అంటిపెట్టుకుని ఉన్న రెండు ఆడ ఏనుగులు, ఒక మగ ఏనుగుకూడా షాక్‌కు గురై మరణించాయి. మిగిలిన రెండు ఏనుగులు త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. పక్కుడుభద్ర తోటల్లోకి పరుగుతీశాయి. సహచర గుంపును వీడిపోవడంతో ఘీంకారాలు మిన్నంటాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడం వల్లే ప్రమాదం జరిగినట్టు విశాఖ రేంజ్ వైల్డ్ లైఫ్ కన్జర్వేటర్ శ్రీకంఠనాథ్‌రెడ్డి స్పష్టంచేశారు.

ప్రమాదవశాత్తు...

ఏనుగులు ప్రమాదశాత్తు మరణించినట్టు గుర్తించామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి శ్రీకంఠనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రమాదానికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్‌పై ఉన్న మట్టి నమూనాలు, పిల్ల ఏనుగుతోపాటు, మిగిలిన ఏనుగుల కళేబరాలపై విద్యుత్ షాక్ కారణంగా ఏర్పడిన కాలిన గాయాలను గుర్తించారు. స్వతహాగా ఏనుగులు అవి సంచరిస్తున్న దారిలో డ్రిప్ పరికరాలను, నీటి మోటార్లు, బోర్లు వంటి యంత్రాలను ధ్వంసం చేస్తుంటాయని, ఆ క్రమంలోనే గున్న ఏనుగు ట్రాన్స్‌ఫార్మర్‌ను తొండంతో తాకినట్టు ప్రాథమికంగా గుర్తించామని చీఫ్ కన్జర్వేటర్ తెలిపారు. అనుకోని విద్యుత్ ప్రమాదంతో ఒకేసారి నాలుగు ఏనుగులు మృతిచెందం బాధగా ఉందన్నారు. ఘటనపై విచారణ చేస్తామని తెలిపారు. మిగిలిన ఏనుగుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ఘటనా స్థలం పరిశీలన

విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాకు చెందిన జిల్లా అటవీ శాకాధికారులు వెంకటేష, ప్రసూన, హారిక, అటవీ రేంజ్ అధికారులు ఎస్. తవిటినాయుడు, త్రినాథరావు, పి.వి.శాస్త్రి, రాజశేఖర్, సింధూ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. శాఖాపరమైన పర్యవేక్షణ చేపట్టారు.

ఆత్మీయ బంధం తలచుకుంటూ....

దాదాపు మూడు నెలలుగా గజరాజుల గుంపు ఇక్కడి జీడి, మామిడి తోటలు, పంటపొలాల్లో తిరుగుతూ వాటికి కావాల్సిన ఆహారం సేకరించుకుంటున్నాయి. నిత్యం జనావాసాలు సమీపంలోకి వస్తున్న ఈ ఏనుగుల గుంపుతో అక్కడి ప్రజలకు సఖ్యత ఏర్పడింది. దీంతో వారు పూజించే లక్ష్మి దేవిగా, గణపతి ప్రతిరూపాలుగా భావించారు. ఏనుగులు తినేందుకు ఆహారం, పండ్లు, నీటి వసతి ఏర్పాటుచేయడం ప్రారంభించారు. ఈ గుంపులో చిన్న ఏనుగు పిల్ల ఉండడంతో స్థానికులు అవి వచ్చే సమయానికి తమ కుటుంబాలతో వెళ్లేవారు. ఆ సమయంలోకూడా అవి ఎటువంటి హానీ చేయకపోవడంతో ప్రజలకు, ఏనుగుల మధ్య బంధం ఏర్పడింది. ఈ తరుణంలో గజరాజులు మరణ వార్తను విన్న స్థానికులు జీర్ణించుకోలేకపోయారు. ఘటనా స్థలానికి కుటుంబాలతో సహా చేరుకున్నారు. తమ మధ్య ఉన్న ఆత్మీయబంధాన్ని తలచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు.



ఏనుగుల మృతిని తట్టుకోలేక రోదిస్తున్న మహిళ

ఆ రెండు ఏనుగులతో జాగ్రత్త..

ఒకే గుంపులోని నాలుగు ఏనుగులు మృతిచెందడం, అవి కనిపించకపోవడంతో మిగిలిన రెండు ఏనుగులు భయంతో ఉన్నాయని, వాటిలో తెలియని అలజడి నెలకుందని, ఏ సమయంలోనైనా జనంపై దాడిచేసే అవకాశం ఉందని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీచేశారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, రెండుమూడు రోజుల పాటు పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్త వహించాలన్నారు. కవ్వింపుచర్యలకు పాల్పడవద్దన్నారు.

ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం..

ఏనుగుల గుంపు బొమ్మిక మిన్నారావు పొలం వద్ద మరణించడంతో అధికారులు అక్కడే వాటి కళేబరాలకు పోస్టుమార్టం చేయాలని నిర్ణయించారు. విశాఖ జంతుప్రదర్శనశాలకు చెందిన వైద్యాధికారి శ్రీనివాసరావు బృందం, భామిని తహసీల్దార్ ఎస్.అప్పారావుల నేతృత్వంలో పంచనామా, పోస్టుమార్టం చేపట్టారు. నాలుగు ఏనుగుల శరీరం నుంచి కిడ్నీలు, కాలేయం, గుండె తదితర శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. మిన్నారావు అనుమతితో అతని పొలంలో జేసీబీ సాయంతో భారీ గుంతను తీశారు. గజరాజుల మృతదేహాలను ఖనం చేసే క్రమంలో సంప్రదాయాలను పాటించారు. ఈ తరుణంలో ప్రజలతోపాటు అధికారులు ఉద్వేగానికి గురయ్యారు.



ఏనుగు కళేబారాన్ని పరీక్షిస్తున్న అటవీశాఖ అధికారులు

జంటగా వెళ్లడం వల్లే...

ఆరు ఏనుగుల గుంపులో ప్రమాదం నుంచి తప్పించుకున్నవి 'జంట' ఏనుగులు. అవి ఎటువైపు వెళ్లినా మిగిలిన నాలుగు ఏనుగులకు కాస్త దూరం పాటించేవి. ప్రమాదం సమయంలోనూ ఆ దూరం వల్లే ప్రాణాలతో బయటపడినట్టు స్థానికులు చెబుతున్నారు.



ఏనుగుల కళేబరాలను చూసి విలపిస్తున్న మహిళ

క్లుప్తంగా

సకాలంలో విద్యాకానుక కిట్ల పంపిణీ



స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో పాఠశాలలకు చేర్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులను ఆదేశించారు. టెక్కలి బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను శుక్రవారం పరిశీలించారు. పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగులు, డిక్షనరీల సరఫరా విషయమై వివరాలు తెలుసుకున్నారు. టెక్కలి మండలంలో 89 పాఠశాలల్లోని 6050 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, డిక్షనరీలు, యూనిఫామ్స్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డీఈఓ తిరుమలచైతన్య, సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ ఆర్.జయప్రకాశ్, ఎంఈఓ నాగభూషణరావు, ఏపీఓ నారాయణరావు, ఏఈ గణేష్, ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


నీలమణిదుర్గ ఉత్సవాలకు రూ.5లక్షలు మంజూరు



కమిటీ సభ్యులకు చెక్ అందజేస్తున్న డీటీలు

పాతపట్నం: పాతపట్నంలో ఈ నెల 21 నుంచి 30 వరకు నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవ నిర్వహణ కోసం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రూ.5 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీలు శైలజ, భీమారావులు ఉత్సవ కమిటీ సభ్యులు నూలు బుజ్జికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామ గణపతి, ఆర్ఐ బాబీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ అధికారిగా రమణ



డీఎల్‌పీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న రమణ

టెక్కలి: టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారిగా ఐ.వి.రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇదివరకు మందస మండలంలో ఈవోపీఆర్డీగా పని చేసి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. టెక్కలి డివిజన్ పరిధిలో సిబ్బంది సహకారంతో మంచినీరు, పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వాహణతో పాటు పంచాయతీ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. ప్రధానంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం దిశగా పాలన అందజేస్తామన్నారు. అనంతరం డివిజన్ పరిధిలో పలువురు పంచాయతీ అధికారులు ఆయనను సత్కరించారు.

15 నుంచి డిగ్రీ స్పాట్ వాల్యుయేషన్

శ్రీకాకుళం న్యూకాలనీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డిగ్రీ మూడో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ఈ నెల 15 నుంచి మొదలుకానుందని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూల్యాంకన ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, హిస్టరీ, పాలిటిక్స్, ఎకనామిక్స్, కామర్స్, మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్ తదితర పేపర్లలో మూల్యాంకనం జరుగుతుందని తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



1990 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో 1990 బ్యాచ్‌కు చెందిన వంద మంది బాల్య మిత్రులు శుక్రవారం ఒకేవేదికపైకి చేరారు. ఆనందాలు, ఆత్మీయ పలకరింపులతో సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఐ.వెంటకరావు, కేశవరావు, మోహనరావు, పి.జయలక్ష్మీలను ఘనంగా సత్కరించారు. తమ ఉన్నతికి గుర్తుగా అదే పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.10వేలు, రూ.7,500, రూ.5000 చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. ఇకపై టెన్త్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రతి ఏడాది స్కాలర్‌షిప్‌గా తమ బ్యాచ్ తరపున రూ.22,500 అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాళ్ల సత్యం, సాడి కామేశ్వరరావురెడ్డి, అనపాన తమ్మయ్య, దట్టి శ్రీను, కాళ్ల శ్రీను, కె.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.



హిరమండలం రిజర్వాయర్ వద్ద తాగునీటి పంపింగ్ యూనిట్ వ్యూ చిత్రాలు

శరవేగంగ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఉద్దానం వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హిరమండలం రిజర్వాయర్ నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రత్యేక పైపులైన్ 55 కిలోమీటర్లు వేయడంతో పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఇన్‌ఫ్రాస్టక్చర్ వారు ప్రత్యేకంగా తీసిన డ్రోన్ చిత్రాలు ఇలా ఆకట్టుకుంటున్నాయి.

– కాశీబుగ్గ



250కు పైగా నిర్మిస్తున్న ట్యాంకులలో ఓ ట్యాంకు నిర్మాణం



ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు (ఐటీఐ)ల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల సమన్వయకర్త కేఎస్ శ్రీనివాసరావు చెప్పారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఐటీఐ.ఏపీ.జీవోఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు అనంతరం ఎక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని, జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలు ఎచ్చెర్ల, శ్రీకాకుళం డీఎల్‌టీసీ, పలాసల్లో నిర్వహించే దరఖాస్తుల పరిశీలనకు హాజరు కావాలని అన్నారు. పరిశీలనకు హాజరు కాకుంటే కౌన్సెలింగ్‌కు అనర్హులవుతారని స్పష్టం చేశారు. జూన్ ఆరు వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని అన్నారు. మూడు ప్రభుత్వ ఐటీఐల్లో 640, 20 ప్రైవేట్ ఐటీఐల్లో 3036 సీట్లు ఉన్నాయని అన్నారు. ఐటీఐల్లో రెండేళ్ల ట్రేడులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానికల్, డ్రాఫ్ట్‌మ్యాన్ సివిల్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఏడాది ట్రేడులు డీజిల్ మెకానికల్, వెల్డర్, కటింగ్ అండ్ సీయింగ్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రొగ్రాం అసిస్టెంట్ ఉన్నాయని అన్నారు. జూన్ ఆరు సాయంత్రం ఐదు గంటలతో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందని చెప్పారు. వివరాలు విద్యార్థుల ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్‌ల రూపంలో వస్తాయని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన అనతరం కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించి ప్రవేశాలు కల్పిస్తామని అన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలను సంప్రదించాలని సూచించారు.

జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం: పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ యూనిట్‌లో 60 రకాల జాబ్‌లకు అవుట్ సోర్సింగ్ ద్వారా నియమకాలు జరుగుతాయని రిమ్స్ సూపరింటెండెంట్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఫైనల్ లిస్ట్ జాబితా జిల్లా వెబ్‌సైట్‌లో 12 నుంచి 15వ తేదీ వరకు ఉంటుందన్నారు. పై జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే నేరుగా రిమ్స్ కార్యాలయంలో ఈ నెల 12వ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

లంచం అడిగి.. రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయిన వర్క్ ఇన్‌స్పెక్టర్ కన్నంనాయుడు

లావేరు: ఇంటి బిల్లు మంజూరు చేయడానికి లంచం అడిగిన అధికారి.. అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి బీవీఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వాళ్లేపేటకు చెందిన కిల్లారి కృష్ణ అనే వ్యక్తికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 2021లో రూ.2లక్షల యూనిట్ విలువతో ఇల్లు మంజూరైంది. మొదటి విడతగా రూ.19 వేలు బిల్లు మంజూరు కాగా అందులో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎం.కన్నంనాయుడు రూ.1900 లంచం అడగడంతో లబ్ధిదారుడు ఇచ్చారు. రెండో విడతగా రూ.1.36 లక్షలు బిల్లు మంజూరైంది. అయితే ఈ డబ్బు కావాలంటే తనకు రూ.13వేలు లంచం ఇవ్వాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ డిమాండ్ చేశాడు. కానీ కృష్ణ డబ్బు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. లంచం ముట్టకపోవడంతో అధికారి బిల్లు ఫైనల్ చేయకుండా కృష్ణను ఇబ్బంది పెట్టాడు. ఎంతగా విన్నవించినా కరుణించలేదు. దీంతో కృష్ణ గత్యంతరం లేక అవినీతి నిరోధక శాఖ అధికారులను ఈ నెల 11న ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు కృష్ణకు రసాయనం పూసిన రూ.13వేలు ఇచ్చి ఆ డబ్బును లంచంగా ఇవ్వాలని సూచించారు. దీంతో లావేరులోని హౌసింగ్ కార్యాలయంలో శుక్రవారం హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు కృష్ణ రూ.13వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను అరెస్టు చేసి విశాఖలోని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. డీఎస్పీతో పాటు సీఐలు భాస్కర్, హరి, సిబ్బంది పాల్గొన్నారు.

జీడి మద్దతు ధరకు ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: ఉద్దాన ప్రాంతం ప్రధాన పంట జీడికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలం సొండిపూడిలో నూతనంగా నిర్మించిన సచివాలయం భవనాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సెక్రటరీ స్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారులకు వరకు జీడి మద్దతు ధర కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఈ సమయంలోనే మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీకి జీడి మద్దతు ధర గుర్తుకు రావడం విచారకరమన్నారు. ఎన్నికల సమయంలో సమస్యలు శివాజీకి బాగానే గుర్తుకు వస్తాయని ఎద్దేవా చేశారు. 60 ఏళ్ల పాలనలో గౌతు కుటుంబం ఈ ప్రాంతానికి ఏం చేసిందని ప్రశ్నించారు. వారు ఆడే నాటకాలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఉద్దానం ప్రాంతానికి ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని స్పష్టం చేశారు. శుద్ధజలం, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పథకాలు, రీసెర్చ్ సెంటర్, రైతుభరోసా, తిత్లీ నష్టపరిహారం పెంపుతో పాటు మౌలిక సదుపాయాలు కూడా కల్పించిందన్నారు. కాగా, మూలిపాడుకు చెందిన బొందల ధనుంజయ నామకరణం ఆధ్వర్యంలో పలు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరాయి. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, సొండిపూడి, మూలిపాడు సర్పంచ్‌లు చిచ్చుల నళినీ, గుసిరి వెంకటరావు, ఎంపీడీఓ వాయలపల్లి తిరుమలరావు, యువజన అధ్యక్షుడు దద్ద కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ గౌరహరో మహంతి, జిల్లా కార్యదర్శి రాపాక శేషగిరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చిచ్చుల శ్రీను, మల్లారెడ్డి జగన్, పోలం శ్రీను, జడ్డిడి భాస్కర్, తెలుకల గురుమూర్తి, సార దూర్వాసులు, దట్టి కోదండరావు, నగిరి ప్రవీణ్‌కుమార్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విజయదుర్గకు మామిడిపండ్ల అలంకరణ



శ్రీకాకుళం నగరంలోని ఇన్‌కంటాక్స్ కార్యాలయం దరి నానుబాలవీధిలో విజయదుర్గ అమ్మవారికి వైశాఖమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర చూత ఫలములు(మామిడిపండ్లు)తో ప్రత్యేక అలంకరణ చేశారు. సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. – శ్రీకాకుళం అర్బన్

14న హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న జరగనున్న హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని సంఘ ప్రతినిధులు పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వీహెచ్‌పీ కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై జీటీ రోడ్డు మీదుగా వివేకానంద జంక్షన్ మహిళా కళాశాల, అరసవిల్లి జంక్షన్, పాతబస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌కు మరలా శోభాయాత్ర చేరుకుంటుందని వివరించారు. స్వామీజీలు, కోలాట బృందాలు, భజన బృందాలు, హనుమాన్ చాలీసా పారాయణ, సాంస్కృతిక నాట్యాలతో శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ సాలక్ పారనంది వెంకటరమణ మూర్తి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు లోకనాథం ఆనంద్, కోశాధికారి ధర్మవరపు ఆచారి, అయ్యప్ప సేవా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు, హోటల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, భక్తి స్వరాంజలి గ్రూప్ గౌరవ అధ్యక్షులు బస్వా శ్రీనివాసరెడ్డి, ట్రాఫిక్ జామ్ శ్రీను గురుస్వామి, జిల్లా సహ మఠమందిర్ ప్రముఖ్ మెట్ట ధనుంజయ, సాప్తహిక్ మిలన్ ప్రముఖ్ ఆశి ఉమామహేశ్వర రెడ్డి, సురక్ష ప్రముఖ కొయ్యాన కిరణకుమార్, భలోపాసనా ప్రముఖ బరాటం సంతోష్, గార మండలం కార్యదర్శి ఆనంద్ కాశ్యప్, ఎస్ఎస్ఎఫ్ సబ్ డివిజన్ కన్వీనర్ లోద్దు కృష్ణారాజు, బగ్గు తరుణ్, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 10 వరకు హెల్త్‌కార్డు గడువు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదులు హెల్త్ కార్డు పొందేందుకు జూన్ 10 వరకు గడువు ఉందని జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గ్రూప్ మెడిక్లెయిమ్, పర్సనల్ యాక్సిడెంట్ పాలసీలు 2023–24 సంవత్సరానికి న్యాయవాదులకు ఖరారు చేసినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్, ప్రభుత్వ గ్రాంట్ కింద ప్రత్యేక కమిటీ 2023–24 సంవత్సరానికి న్యాయవాదులకు గ్రూప్ మెడీ-క్లెయిమ్, వ్యక్తిగత ప్రమాద విధానాలు ఖరారు చేసిందని పేర్కొన్నారు. కుటుంబంలో న్యాయవాదితో పాటు మరో ముగ్గురు (భార్యాపిల్లలు/ఆధారపడి ఉన్న వారు)కు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. ప్రీమియంలో దాదాపు 1/3వ వంతు సంబంధిత బీమా చేసిన న్యాయవాది చెల్లించాలని, మిగిలిన మిగిలిన మొత్తాన్ని ఏపీ ప్రభుత్వ గ్రాంట్, బార్ కౌన్సిల్ నిధుల నుంచి చెల్లిస్తారని తెలిపారు. ప్రమాదవశాత్తు న్యాయవాది చనిపోతే (కుటుంబ సభ్యులకు వర్తించదు) రూ.10 లక్షల పరిహారం అందుతుందని చెప్పారు. 70 ఏళ్లలోపు లాయర్లు మాత్రమే పాలసీకి అర్హులని స్పష్టం చేశారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన నర్సింహులు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న జీరు నర్సింహులు (67) అనే వృద్ధుడ్ని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పైడిభీమవరం పంచాయతీ చిల్లపేటకు చెందిన నర్సింహులు జాతీయ రహదారి పక్కన మేకలు మేపుతుండగా శుక్రవారం ఉదయం 8.30 గంటల సమయంలో శ్రీకాకుళం వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆపకుండా వెళ్లిపోయిన కారును స్థానికులు గమనించి జే.ఆర్.పురం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో జాతీయ రహదారిపై ఉన్న సీసీ ఫుటేజీ ఆధారంగా జార్ఖండ్‌కు చెందిన కారుగా గుర్తించి నాతవలస టోల్ సమీపంలో పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. నర్సింహులుకు వివాహితలైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

శ్రీకాకుళం రూరల్: గార మండల పరిధిలోని కొత్తూరు సైరిగాంలో మునలమ్మ కోనేరులో జరుగుతున్న ఉపాధి పనులను జెడ్పీ సీఈవో వెంకటరామన్, జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, పీడీ చిట్టిరాజులు శుక్రవారం పరిశీలించారు. క్షేత్ర సహాయకులు, మేట్లు, వేతనదారులతో మాట్లాడారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులు ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడీ శైలజ, ఎంపీడీఓ రామ్మోహన్‌రావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి తిరుమలరావు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడూ పోలీసే..



ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం చిత్రంలో ఎమ్మెల్యే రెడ్డిశాంతి, పోలీసు అధికారులు

- శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్
- కొత్తూరు నూతన పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని

కొత్తూరు: ప్రతి పౌరుడూ పోలీసేనని, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. కొత్తూరులో రూ.2.50 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని స్పీకర్ శుక్రవారం ప్రారంభించారు. ముందుగా పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని స్పీకర్‌తో కలిసి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యాధునిక సౌకర్యాలతో 25 పోలీస్ స్టేషన్‌లను నిర్మించగా, ఒక్కో స్టేషన్‌కు రెండున్నర కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఒడిశా ఆంధ్రా సరిహద్దు మండలాలైన కొత్తూరు, మందసలో నూతన భవనాలు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ నడుస్తోందన్నారు. ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పేదిరకం నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డీఐజీ జి.హరికృష్ణ, ఎస్పీ జి.ఆర్.రాధిక, ఏఎస్పీ పి.విఠలేశ్వరరావు, టెక్కలి సబ్ డివిజన్ డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ బాలరాజు, సీఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్ఐ ఎం.గోవిందరావు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ బోర్డు మెంబర్ సురాడ రాజేశ్వరి, ఈఈ తమ్మిరెడ్డి, డీఈఈ వెంకటరెడ్డి, కాంట్రాక్టర్ రఘురాం పండా, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పీఏసీఎస్ చైర్మన్లు చింతాడ సూర్యనారాయణ, ఏవీ సురేష్, కె.కృష్ణ ఏఎంసీ చైర్మన్ అర్జునరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట నందకుమార్, మొజ్జాడ చక్రపాణి, బూర్లె శ్రీనివాసరావు, గండివలస ఆనందరావు, కామక త్రినాథరావు, లోతుగెడ్డ తిరుపతిరావు, వైస్ ఎంపీపీ ప్రతీప్, వనుము లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

ఇచ్ఛాపురం రూరల్: జిల్లాలో ప్రీ ప్రైమరీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 10,516 మంది గర్భిణులు, 10,384 మంది బాలింతలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం రూరల్ ఐసీడీఎస్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించిన ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధనకు అనువుగా రోజుల వ్యవధిలో కార్యకర్తలు, ఆయాల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. పౌష్టికాహారం, మౌలిక వసతుల కల్పనలో లోటుపాట్లు, అక్రమాలకు తావు లేకుండా ప్రత్యేక యాప్‌లు రూపొందించినట్లు తెలిపారు. శానిటేషన్ యాప్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రం, పరిసరాల పరిశుభ్రత వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయిస్తున్నామని, పారిశుద్ధ్యం లోపిస్తే వెంటనే యాప్‌లో వివరాలు నమోదు చేస్తే సంబంధిత పంచాయతీ కార్యదర్శికి సమాచారం వెళుతుందన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు కోడిగుడ్లు, పాలు, బాలామృతం, అటుకులు, రాగిపిండి, జొన్నపిండి, కర్జూరం, బెల్లం, చిక్కీలతో కూడిన కిట్లు సరఫరా చేస్తున్నామని వివరించారు. చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సమావేశంలో సీడీపీఓ పురాణం నాగరాణి, ఏసీడీపీఓ వై.లావణ్య, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల వసతి గృహంలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో చలన సంబంధ, బధిర, అంధ, విభిన్న ప్రతిభావంతులైన బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖ ఏడీ కవిత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో వసతి గృహం ఉందని, ఇందులో ప్రవేశానికి 2023–24 విద్యా సంవత్సరంలో 1 నుంచి 10వ తరగతి, ఇంటర్, ఆపై తరగతులు చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఉచిత భోజన, వసతి, నోట్ పుస్తకాలు, యూనిఫాం, కాస్మొటిక్ చార్జీలు తదితర సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఏడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, పూర్తి వివరాలకు 08942–240519, 8074777210, 9951971764 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాల సప్లిమెంటరీ ఫలితాల వెల్లడి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(అటానమస్)కు చెందిన 1, 3, 5 సెమిస్టర్ల సప్లిమెంటరీ ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు శుక్రవారం విడుదల చేశారు. ఒకటో సెమిస్టర్‌లో బీఏ 66.67 శాతం, బీకాం 69.39 శాతం, బీకాం కంప్యూటర్స్ 88.68, బీఎస్సీ 61.59 ఉత్తీర్ణతతో విద్యార్థులు పాసైనట్టు చెప్పారు. మూడో సెమిస్టర్‌లో బీఏ 60 శాతం, బీకాం 66.67, బీకాం కంప్యూటర్స్ 89.13, బీఎస్సీలో 81.03 శాతం ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.